
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
1-5-2026 (Friday) MAIN EDITION

## ఏడాదికి రూ. 33 వేల కోట్ల పింఛన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ



**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు రాత్రిపగలు కష్టపడుతున్నామని, ప్రజల ముఖాల్లో చిరునవ్వు చూడడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కృష్ణా జిల్లా పమిడిముక్కలలో శుక్రవారం ఏర్పాటు చేసిన 'పేదల సేవ' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, ఏపీకి పూర్వవైభవం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పడుతున్న శ్రమను ప్రజల సంతోషం ముందు మర్చిపోతున్నానని చెప్పారు.

## పోలీసుల తీరుపై హైకోర్టు ఆగ్రహం..



**అక్షరటుడే, హైదరాబాద్:** పెండింగ్ ట్రాఫిక్ చలానాల కారణంగా వాహనాన్ని అక్రమంగా సీజ్ చేశారన్న ఆరోపణలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులకు కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసింది. ట్రాఫిక్ చలానాలు పెండింగ్‌లో ఉన్నాయనే నెపంతో వాహనాన్ని, ఆర్‌సీని పోలీసులు సీజ్ చేశారు. కేవలం చలాన్ల కోసం వాహనాన్ని స్వాధీనం చేసుకోవడం చట్టవిరుద్ధమని బాధితుడు కోర్టును ఆశ్రయించారు. దీనిని తీవ్రంగా పరిగణించిన హైకోర్టు నోటీసులు ఇచ్చింది.

## పోలవరంపై జలశక్తి కార్యదర్శి సమీక్ష

**అక్షరటుడే, అమరావతి:** పోలవరం నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి కాంతారావు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రం నుంచి సీఎస్ సాయి ప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు. పోలవరం పునరావాస కార్యక్రమాలు పూర్తి చేయడంపై సమీక్షించినట్లు సమాచారం.



## డీజీసీఏకు పైలట్స్ అసోసియేషన్ లేఖ

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పైలట్లకు విశ్రాంతి కల్పించేందుకు రూపొందించిన ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ (ఎఫ్‌డీటీఎల్) నిబంధనలు అమల్లోకి రాకపోవడంపై పైలట్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తంచేసింది. విమాన ప్రయాణంలో పైలట్లు అనారోగ్యానికి గురవడం, మరణించడం వంటి విషయాలపై డీజీసీఏకు లేఖ రాసింది.



## ఫార్మా కంపెనీలో పేలిన రియాక్టర్

**అక్షరటుడే, నల్గొండ:** నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులోని నోష్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలింది. ఈ ఘటనలో తొమ్మిది మంది కార్మికులు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.



## లంచం అడిగిన అధికారి.. చెప్పుతో కొట్టిన కండక్టర్

**అక్షరటుడే, సంగారెడ్డి:** లంచం ఓ అధికారిని బస్ కండక్టర్, ప్రయాణికులు చెప్పులతో కొట్టారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లాలో చోటు చేసుకుంది. నారాయణఖేడ్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును టికెట్ ఇన్‌స్పెక్టర్ రాయికోడ్ వద్ద ఆపారు. అందరి వద్ద టికెట్లు ఉన్నాయా లేదా అని చెక్ చేశారు. ఆ సమయంలో ఓ వ్యక్తి టికెట్ తీసుకోలేదని గుర్తించారు. ఆ ప్రయాణికుడితో పాటు కండక్టర్‌పై కేసు పెట్టకుండా ఉండేందుకు సదరు అధికారి రూ.20 వేల లంచం డిమాండ్ చేశాడు. దీంతో ఆగ్రహానికి గురైన కండక్టర్, డ్రైవర్, ప్రయాణికులు అతడిపై చెప్పులతో దాడి చేశారు. టికెట్ ఇన్‌స్పెక్టర్ వాహనాన్ని రోడ్డుపైనే ఆపి ప్రయాణికులు వాగ్వాదానికి దిగారు. వాదన తీవ్రరూపం దాల్చడంతో అధికారిపై కండక్టర్, ప్రయాణికులు కొట్టారు.

## కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరాకు ఊరట..

**అక్షరటుడే, ఢిల్లీ:** కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరాకు సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఆరోపణలు, ఎఫ్ఐఆర్ రెండూ రాజకీయ వైరం కారణంగానే తలెత్తినట్లు కనిపిస్తున్నాయని కోర్టు వ్యాఖ్యానించింది. పవన్ ఖేరా గతంలో ఓ సమావేశంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ భార్య రినికి భూయాన్ శర్మపై తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో ఆమె పరువు నష్టం కేసు దాఖలు చేశారు. ఈ కేసులో సుప్రీంకోర్టు శుక్రవారం ముందస్తు బెయిల్ మం జూరు చేసింది. బెయిల్ మంజూరు చేస్తూ ఈ కేసు దర్యాప్తునకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోర్టు ఖేరాను ఆదేశించింది.

# జీఎస్టీ వసూళ్లలో రికార్డు




**దేశంలో జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో పెరిగాయి. ఏప్రిల్ నెలలో 8.7 శాతం వృద్ధితో రూ.2.43 లక్షల కోట్ల మేర జీఎస్టీ వసూలైంది. దేశీయంగా విక్రయాలు పెరగడం, దిగుమతులతో పన్ను వసూళ్లు పెరిగినట్లు అధికారులు తెలిపారు. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు కొనసాగుతున్నా.. దేశంలో పన్ను వసూళ్లు భారీగా పెరగడం వ్యాపార కార్యకలాపాలకు తక్షణ అంతరాయం కలగలేదని నిరూపిస్తున్నాయి.**

–అక్షరటుడే, నేషనల్‌డెస్క్

- ఏప్రిల్‌లో 8.7శాతం వృద్ధి నమోదు
- మొత్తం రూ.2.43 లక్షల కోట్లు వసూలు
- దేశీయంగా పెరిగిన విక్రయాలు

ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఏప్రిల్ 2026లో మొత్తం స్థూల జీఎస్‌టీ ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 8.7 శాతం వృద్ధి చెందింది. గత ఏడాది ఇదే నెలలో రూ. 2,23,265 కోట్లు వసూలు కాగా.. ఈ సారి ఆదాయం రూ.2,42,702 కోట్లకు చేరుకుంది. దిగుమతులకు సంబంధించిన పన్నుల వసూళ్లలో వచ్చిన భారీ పెరుగుదల ఈ వృద్ధికి కారణమని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

### దిగుమతులతోనే..

కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో దేశీయ వసూళ్ల కంటే దిగుమతి సంబంధిత వసూళ్లే అధిక వృద్ధిని నమోదు చేశాయి. దిగుమతుల ద్వారా వచ్చిన రూ. 57,580 కోట్ల స్థూల ఆదాయం వచ్చింది. గతేడాది ఏప్రిల్‌లో ఇది రూ.45,754 కోట్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే 25.8 శాతం పెరగడం గమనార్హం. స్థూల దేశీయ ఆదాయం 4.3 శాతం వృద్ధి చెంది రూ.1,85,122 కోట్లకు చేరుకుంది.

### రూ.2.10 లక్షల కోట్లు

మొత్తం దేశీయ ఆదాయంలో కేంద్ర జీఎస్‌టీ రూ. 52,140 కోట్లు, రాష్ట్ర జీఎస్‌టీ రూ. 61,331 కోట్లుగా ఉంది. ఐజీఎస్‌టీ రూ.71,651 కోట్లు వసూలైంది. వాపసులను సర్దుబాటు చేసిన తర్వాత ఏప్రిల్ 2026 నాటికి నికర ఆదాయం రూ. 2,10,909 కోట్లు అని అధికారులు తెలిపారు.

### ఈ రాష్ట్రాలు టాప్..

గణాంకాల ప్రకారం పలు రాష్ట్రాలు ఎస్‌జీఎస్‌టీ వసూళ్లలో భారీగా వృద్ధి నమోదు చేశాయి. మహారాష్ట్ర 40 శాతం, కర్ణాటక 42 శాతం, తెలంగాణ 36 శాతం, పుదుచ్చేరి 108 శాతం వృద్ధితో వసూళ్లు రాబట్టాయి. అదే సమయంలో లడఖ్ వృద్ధి మైనస్ 8 శాతంగా ఉంది. జార్ఖండ్‌లో సున్న శాతం నమోదు కాగా.. కొన్ని రాష్ట్రాలు క్షీణతను లేదా ఎటువంటి మార్పు లేకపోవడాన్ని నమోదు చేశాయి. మార్చిలో స్థూల జీఎస్‌టీ వసూళ్లు రూ.2,00,064 కోట్లుగా నమోదయ్యాయి.

## మోదీపై కేటీఆర్ ఫైర్..



**అక్షరటుడే, హైదరాబాద్ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్‌లో ఎన్నికలు ముగియగానే దేశవ్యాప్తంగా కమర్షియల్ సిలిండర్ ధరలను భారీగా పెంచారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం మే డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఎన్నడూ లేనంతగా వాణిజ్య సిలిండర్లపై రూ.993 పెంచిన ఘనత మోదీదే అని విమర్శించారు. ఎన్నికలు అయిపోగానే గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచడం మోదీకి అలవాటు అయిందన్నారు. ఒక్క సిలిండర్ మీద దాదాపు రూ.వెయ్యి పెంచి సామాన్యులకు, హోటళ్లలో పని చేసే కార్మికులకు మోదీ మేడే కానుక ఇచ్చారని వ్యాఖ్యానించారు.



## రాష్ట్ర డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతల స్వీకారం

**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. పదవీ విరమణ చేసిన బి.శివధర్ రెడ్డి స్థానంలో ప్రభుత్వం ఆయనను ఈ అత్యున్నత పదవికి ఎంపిక చేసింది. ఇప్పటివరకు హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన, శుక్రవారం డీజీపీ కార్యాలయంలో అధికారికంగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు పోలీస్ ఉన్నతాధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



## 'కడియం' సంచలన వ్యాఖ్యలు

**అక్షరటుడే, వరంగల్:** మాజీ సీఎం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పాలన, ఆయన కుటుంబంపై స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. స్టేషన్ ఘన్‌పూర్ మండలం మీదికొండలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కేసీఆర్ వైఖరి వల్లే తాను ఆ పార్టీకి దూరమయ్యానని స్పష్టం చేశారు. వరంగల్ జిల్లాకు ఉన్న గొప్ప రాజకీయ చరిత్రను కేసీఆర్ కనుమరుగు చేశారని కడియం ఆరోపించారు. జిల్లాను ముక్కలు చేయవద్దని తాను గతంలోనే సూచించినప్పటికీ, తన మాటను లెక్కచేయకుండా వరంగల్‌ను ఆరు భాగాలుగా విడగొట్టి గందరగోళం సృష్టించారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం వల్ల కేవలం కల్వకుంట్ల కుటుంబానికి మాత్రమే లబ్ధి చేకూరిందని కడియం వ్యాఖ్యానించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్ర సంపదను దోచుకోవడమే లక్ష్యంగా ఆ కుటుంబం పనిచేసిందని ఆరోపించారు.

## హైదరాబాద్‌లో మరో అగ్నిప్రమాదం



**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** హైదరాబాద్‌లో వరుస అగ్ని ప్రమాదాలు కలవరపెడుతున్నాయి. తాజాగా పాతబస్తీలోని బహదూర్‌పురాలో పెద్ద ఎత్తున మంటలు అంటుకున్నాయి. బహదూర్‌పురాలో జూ పార్క్ సమీపంలోని తాడ్‌బాన్‌లో ఉన్న ఒక స్క్రాప్ షాపు, టింబర్ డిపోలో గురువారం అర్ధరాత్రి సమయంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఆ ప్రాంతంలో మంటలు వేగంగా వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. ముందు జాగ్రత్తగా చుట్టు పక్కల వారిని పోలీసులు ఖాళీ చేయించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం.

## ముంబైలో రూ.1,745 కోట్ల కొకైన్ సీజ్



**అక్షరటుడే, న్యూఢిల్లీ:** దేశ ఆర్థిక రాజధాని ముంబైలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించారు. ఒక అంతర్జాతీయ డ్రగ్ సిండికేట్‌ను ఛేదించిన అధికారులు, సుమారు రూ.1,745 కోట్ల విలువైన 349 కిలోల అత్యంత నాణ్యమైన కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుక్రవారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో అధికారులు ఒక చిన్న క్లూ ఆధారంగా దర్యాప్తు మొదలుపెట్టి, చివరకు అతిపెద్ద అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను వెలికితీశారు. దీనిని అమిత్ షా 'అద్భుత విజయం'గా అభివర్ణించారు. దేశాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, మాదకద్రవ్యాల ముఠాలను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తామని హోం మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## పలు మార్గాల్లో ఎయిరిండియా సర్వీసులు తగ్గింపు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులతో విమానాల్లో వాడే ఇంధన ధరలు పెరిగిన విషయం తెలిసిందే. దీంతో ఎయిర్‌లైన్ సంస్థలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఈ క్రమంలో తాజాగా ఎయిర్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. పలు మార్గాల్లో విమాన సర్వీసులను తగ్గించింది. దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో ప్రతి రోజూ 100 విమానాలను తక్కువగా నడపనున్నట్లు పేర్కొంది. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలు విపరీతంగా పెరగడంతో, ఎయిర్ ఇండియా దేశీయ, అంతర్జాతీయ నెట్‌వర్క్‌లలో తన కార్యకలాపాలను తగ్గించింది. ఈ సంస్థ ప్రస్తుతం రోజుకు సుమారు 1,100 విమానాలను నడుపుతోంది. అయితే ఇందులో 100 విమానాలను తగ్గించనుంది. జూన్ నెలలో యూరప్, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్‌లతో కలిపే మార్గాలలో విమాన సర్వీసులు తగ్గించనున్నట్లు సమాచారం.

## స్టన్నింగ్ లుక్‌లో మెస్మరైజ్ చేస్తున్న బుట్టబొమ్మ!

**టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో బుట్ట బొమ్మగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న బామ పూజా హెగ్డే. తన అందం, అభినయంతో అందరి దృష్టిని ఆకట్టుకొని ఊహించని పాపులారిటీ సొంతం చేసుకుంది. అయితే ఈ బ్యూటీ కొంతకాలంగా సరైన అవకాశాలు లేక.. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేక హిట్ కోసం ఎదురుచూస్తోంది. ప్రస్తుతం హిందీలో, తమిళ్‌లో సినిమాలు చేస్తోంది. అందులో భాగంగానే తాజాగా బ్లూ అవుట్ ఫిట్‌లో సెల్ఫీ ఫొజులతో షేర్ చేసిన కొన్ని ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి.**

- అక్షరటుడే, సినిమాడెస్క్

